మురసు తుఫాను నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

అత్యవసర సహాయం అందించేందుకు 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు

- జిల్లా కలెక్టర్ అంకిత్




కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 3,(ప్రజాజ్యోతి) మురసు తుఫాను ప్రభావంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భారీనుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి వర్షపాత పరిస్థితులు, ముందస్తు జాగ్రత్తలు, అత్యవసర

మిగతా 2 లో...

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | 4 | నవంబర్ | 2026 ◆ పేజీలు : 8

- నమ్మకానికి పాతర వేసి ప్రభుత్వ ధాన్యం మాయం.. 'శ్రీజ' యజమాని ఘరానా దందా!
- 2025–2026 సిఎంఆర్ రైస్ కి సంభందించి ప్రభుత్వానికి టోకర
- కోట్ల రూపాయల ధాన్యాన్ని పంది కొక్కుల మింగేసాడు..!
- అసలు + 25% పెనాల్టీతో కలిపి మొత్తం రూ. 6.91 కోట్లుగా తేలిన లెక్క..
- కాంగ్రెస్ 'రాష్ట్ర నాయకుడి' ముసుగులో తిరిగిన పెద్దమనిషి అసలు భాగోతం బట్టబయలు!
- మంత్రి పొంగులేటి పేరును అడ్డు పెట్టుకొని ప్రభుత్వాన్నే మోసగించిన వైనం
- ఘరానా మోసంపై క్రిమినల్ కేసు నమోదు.. ప్రస్తుతం అరెస్ట్ భయంతో పరారీలో అక్రమార్కుడు!
- వెంటనే అరెస్ట్ చేసి జైలుకు పంపాలని ప్రజలు, ప్రజాసంఘాల ఉవ్వెత్తున డిమాండ్!



5 లో..

'ఆళ్ల మురళి' మెక్కింది.. 17,500 క్వింటాళ్లు!

- భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ప్రజాజ్యోతి

రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి పేదలకు బియ్యంగా అందించాలని ప్రభుత్వం ఇచ్చిన నమ్మకానికి 'శ్రీజ రైస్ మర్చంట్' యజమాని ఆళ్ల మురళీగోపాలకృష్ణ దారుణంగా పాతర వేశాడు! పౌరసరఫరాల శాఖ ఎంతో నమ్మకంతో 2025 – 2026 సంవత్సరానికి సంబంధించి కేటాయించిన ఏకంగా 17,500 క్వింటాళ్ల వడ్లను (ధాన్యాన్ని) మిల్లులో ఉంచకుండా పందికొక్కులా మెక్కేశాడు.

పోలీసు సంక్షేమానికి పెద్దపీట..!

- చాతకొండ బెటాలియన్ లో కొత్త బ్యారెక్స్ కు శంకు స్థాపన...
- సిబ్బంది సౌకర్యాలే ప్రధాన లక్ష్యం...
- మెన్ బ్యారెక్స్ నిర్మాణానికి భూమి పూజ చేసిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్....



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి. నవంబర్ 3, (ప్రజాజ్యోతి) : పోలీసు సిబ్బంది సంక్షేమానికే అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. మంగళవారం చాతకొండలోని 6వ బెటాలియన్ ను ఆయన సందర్శించారు. ముందుగా బెటాలియన్ కు చేరుకున్న ఎస్పీకి కమాండెంట్ పీ.సీ.వి.రమణ పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం సిబ్బంది నుంచి ఎస్పీ గౌరవ వందనాన్ని స్వీకరించారు. బెటాలియన్ లో సిబ్బంది కోసం నూతనంగా నిర్మించనున్న మెన్ బ్యారెక్స్ నిర్మాణానికి ఎస్పీ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి కల్పిస్తున్న వసతులు, చేపట్టబోయే నూతన నిర్మాణాలపై కమాండెంట్ తో చర్చించారు. సిబ్బందికి అవసరమైన

మిగతా 2 లో...

మేడి అఖిల్ హత్య కేసులో కదలిక..!



- మరో ముగ్గురు యువకులు అరెస్ట్...
- ఎదురుగడ్డ హత్య కేసులో పోలీసుల దూకుడు...
- అఖిల్ హత్య కేసులో మూడు ఫోన్లు స్వాధీనం.. దర్యాప్తు ముమ్మరం..!
- మొత్తంగా లక్ష్మీదేవిపల్లి హత్య కేసులో ఏడుగురు అరెస్ట్..!

2 లో...

- 8 వేల ఎకరాల్లో యాసంగి వరి సాగు బంద్..!
- ఎల్ నినోతో వ్యవసాయానికి గండం..
- కూలీలకు పనుల కొరత..
- నిత్యావసరాల ధరలు పెరగడంతో సామాన్యుడు విలవిల...



ఎల్‌నినో ప్రభావం.. పేదల బతుకులపై భారం..!

చర్ల, నవంబర్ 03:(ప్రజాజ్యోతి): ఎల్‌నినో ప్రభావం పేద, మధ్యతరగతి ప్రజల జీవనంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వాతావరణంలో చోటుచేసుకునే మార్పులు, వర్షపాతం అసమతుల్యత, ఉష్ణోగ్రతల పెరుగుదల వ్యవసాయ రంగాన్ని ప్రభావితం చేస్తే.. దాని ప్రభావం క్రమంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై పడుతుంది. ముఖ్యంగా వ్యవసాయంపై ఆధారపడి జీవించే చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, రోజువారీ కూలీ పనులు చేసుకునే నిరుపేద కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. పంట దిగుబడులు తగ్గడం, సాగు ఖర్చులు పెరగడం,

మిగతా 2 లో...

పోలీసు సంక్షేమానికి పెద్దపీట..!





(మొదటి పేజీ తరువాయి...)

మౌలిక వసతులు కల్పిస్తే పోలీసు శాఖ పనితీరు మరింత బలోపేతం అవుతుందని ఎస్పీ తెలిపారు. సంక్షేమమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.ఈ కార్యక్రమంలో అదనపు కమాండెంట్ ఎస్. శ్రీధర్ రాజా, అసిస్టెంట్ కమాండెంట్లు ఎ.వి. రమణయ్య, రామకృష్ణ రెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్ఐలు జె. లెనిన్ బాబు, సి.హెచ్.వి.శ్రీనివాసరెడ్డి, జి.వి. రామారావు, బి. జానయ్య, బెటాలియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మురుసు తుఫాను నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి...)

సహాయక చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ హెచ్చరికలు, వర్షపాత తీవ్రతను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. తహశీల్దార్లు, ఎంపీడీవోలు, జీపీవోలు, పంచాయతీ కార్యదర్శులు విధిగా తమ ప్రధాన కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. గ్రామాలు, మున్సిపల్ ప్రాంతాల్లో టాంటాం ద్వారా ప్రజలకు హెచ్చరికలు జారీ చేసి అప్రమత్తం చేయాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి, అందులో నివసిస్తున్న వారిని అవసరమైన మేరకు సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, పాత, శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాల పరిస్థితులను పరిశీలించి విద్యార్థుల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలు, డ్రైనేజీలు, ఓపెన్ నాలాలను నిరంతరం పర్యవేక్షిస్తూ నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమ శాఖల ఇంజనీరింగ్ అధికారులు పాత వంతెనలు, కల్వర్టులు, ప్రమాదకర రహదారులను పరిశీలించాలని ఆదేశించారు. జిల్లాలో గుర్తించిన 94 ప్రమాదకర రహదారుల వద్ద అవసరమైన చోట ముందస్తుగా బారికేడింగ్ ఏర్పాటు చేయాలన్నారు. వాగులు, వంకలు పొంగి ప్రవహించే ప్రాంతాల్లో ప్రజల రాకపోకలను నియంత్రించాలని, చేపల వేట, పర్యాటక కార్యకలాపాలకు అనుమతించవద్దని అటవీ శాఖ అధికారులకు సూచించారు. మైనింగ్ కార్యకలాపాలపై కూడా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. ప్రజల సహాయార్థం 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు భారీ వర్షాలు, తుఫాను ప్రభావంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తక్షణ సహాయం అందించేందుకు కొత్తగూడెంలోని ఐడీఓసీ కార్యాలయం, గది నంబర్ ఎఫ్–28లో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు అత్యవసర సమాచారం, వర్షాలు, వరదల కారణంగా ఎదురయ్యే సమస్యలను కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు 08744-241950, 9392919743 ద్వారా తెలియజేయాలని సూచించారు. కంట్రోల్ రూమ్ సిబ్బంది నిరంతరం విధుల్లో ఉంటూ ఫిర్యాదులను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేసి, సంబంధిత శాఖలకు వెంటనే తెలియజేసి పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రతి తహశీల్దార్, ఎంపీడీవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని, ప్రజల నుంచి వచ్చే సమాచారంపై తక్షణమే స్పందించాలని సూచించారు. అధికారులు విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా, ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు ప్రాధాన్యతనిస్తూ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. టెలికాన్ఫరెన్స్‌లో మండలాల వారీగా వర్షపాత పరిస్థితులను అధికారులు వివరించారు. చర్ల, దుమ్ముగూడెం, మణుగూరు, పినపాక మండలాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తుండగా, అశ్వారావుపేటలో మోస్తరు నుంచి భారీ వర్షం కురుస్తున్నట్లు తెలిపారు. కొత్తగూడెం, మణుగూరు, ఇల్లందు మున్సిపాలిటీల్లో సంబంధిత సిబ్బందిని అప్రమత్తం చేసి పారిశుద్ధ్య, డ్రైనేజీ నిర్వహణ చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

ఎల్‌నినో ప్రభావం.. పేదల బతుకులపై భారం..!

(మొదటి పేజీ తరువాయి...)

పనిదినాలు తగ్గడం, ఆహార పదార్థాల ధరలు పెరిగే పరిస్థితులు ఏర్పడితే పేదల కుటుంబ బడ్జెట్ తలకిందులయ్యే అవకాశముంది.

వ్యవసాయ రంగంపై ప్రభావం

ఎల్‌నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలోని సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల్లో చోటుచేసుకునే మార్పులతో సంబంధం ఉన్న వాతావరణ దృగ్విషయం. దీని ప్రభావంతో ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో వర్షపాతం, ఉష్ణోగ్రతల సరళిలో మార్పులు సంభవించవచ్చు. అయితే ప్రతి ఎల్‌నినో సమయంలోనూ ఒకేవిధమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడతాయని చెప్పలేం. స్థానిక వాతావరణ పరిస్థితులు, రుతుపవనాల కదలికలు, నీటి నిల్వలు కూడా కీలక పాత్ర పోషిస్తాయి.వర్షాలు సకాలంలో కురవకపోవడం, సుదీర్ఘ విరామాలు ఏర్పడటం, అధిక ఉష్ణోగ్రతలు నమోదవడం వంటి పరిస్థితులు పంటల ఎదుగుదలను దెబ్బతీస్తాయి. సాగునీటి వనరుల్లో నీటి నిల్వలు తగ్గితే రైతులు బోరుబావులు, ఇతర నీటి వనరులపై ఆధారపడాల్సి వస్తుంది. దీంతో విద్యుత్తు, డీజిల్, నీటి సరఫరా, ఎరువులు, పురుగుమందుల కోసం అదనపు ఖర్చులు చేయాల్సి రావచ్చు.ఇప్పటికే పెట్టుబడుల కోసం అప్పులు చేసిన రైతులకు పంట దిగుబడి తగ్గితే వాటిని తిరిగి చెల్లించడం కష్టమవుతుంది. పంట చేతికి రాకపోతే తదుపరి సీజన్‌లో సాగు చేయడానికి అవసరమైన పెట్టుబడులనూ సమకూర్చుకోలేని పరిస్థితి ఏర్పడవచ్చు. ఈ ప్రభావం చిన్న, సన్నకారు రైతులపై మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.చర్ల మండలంలో రైతులు వరప్రసాదంగా భావించే తాలిపేరు ప్రాజెక్టు ఆయకట్టు కింద ఎలినినో ప్రభావం వల్ల ఈ ఏడాది యాసంగి సీజన్ లో వరి పంట సాగు నిలుపుదల చేయాలని అధికారులు, ప్రభుత్వ పాలకులు మందుగా హెచ్చరిక జారీ చేశారు. సుమారు 8 వేల ఎకరాల్లో వరి పంట సాగు బంద్ కావడంతో కూలీలకు పనులు కరువు..

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయమే అనేక కుటుంబాలకు ప్రధాన జీవనాధారం. పొలం దున్నడం నుంచి నాట్లు వేయడం, కలుపు తీయడం, ఎరువులు వేయడం, పంట కోతల వరకు వివిధ దశల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి లభిస్తుంది. వర్షాభావం కారణంగా సాగు విస్తీర్ణం తగ్గినా, పంటలు దెబ్బతిన్నా, కోతల పనులు తగ్గినా కూలీలకు పనిదినాలు తగ్గిపోతాయి.రోజూ పనిచేస్తేనే కుటుంబాన్ని పోషించుకునే వారికి ఒకటి, రెండు రోజుల పని కోల్పోయినా ఆ ప్రభావం ఇంటి ఖర్చులపై పడుతుంది. పిల్లల చదువులు, వైద్య ఖర్చులు, ఇంటి అద్దె, విద్యుత్తు బిల్లులు, నిత్యావసర వస్తువుల కొనుగోలు భారంగా మారతాయి. గ్రామాల్లో ఉపాధి అవకాశాలు తగ్గితే కొందరు కుటుంబాలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితులు కూడా ఎదురుకావచ్చు.ఇప్పటికే బియ్యం ధరలు విపరీతంగా పెరిగాయి. దానికి తోడు నిత్యావసరాల ధరలు పెరిగితే మరింత కష్టం వాతావరణ పరిస్థితుల కారణంగా పంటల దిగుబడులు తగ్గి మార్కెట్‌కు వచ్చే సరుకు పరిమాణం తగ్గితే కొన్ని ఆహార పదార్థాల ధరలపై ఒత్తిడి పెరగవచ్చు. రవాణా, నిల్వ, ఉత్పత్తి ఖర్చులు పెరగడం కూడా ధరలపై ప్రభావం చూపుతుంది. అయితే ప్రతి వస్తువు ధర తప్పనిసరిగా పెరుగుతుందని చెప్పలేం. సరఫరా, నిల్వలు, దిగుమతులు, ప్రభుత్వ చర్యలు వంటి అంశాలపైనా ధరలు ఆధారపడి ఉంటాయి. కూరగాయలు, పప్పులు, నూనెలు, బియ్యం వంటి నిత్యావసరాల కొనుగోలుకు పేద కుటుంబాలు తమ ఆదాయంలో ఎక్కువ భాగాన్ని వెచ్చించాల్సి వస్తే ఇతర అవసరాల కోసం డబ్బు మిగలదు. ఆదాయం స్థిరంగా ఉండి ఖర్చులు పెరిగితే అప్పులు చేయడం, అవసరాలను తగ్గించుకోవడం తప్ప మరో మార్గం కనిపించని పరిస్థితి ఏర్పడవచ్చు.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు సవాల్

రైతు పంట పండిస్తేనే కూలీలకు పని లభిస్తుంది. కూలీలకు ఆదాయం ఉంటేనే గ్రామాల్లోని చిన్నదుకాణాలు, కిరాణా వ్యాపారాలు, చిరు వ్యాపారాలు కొనసాగుతాయి. వ్యవసాయ ఆదాయం తగ్గితే ఈ రంగాలపైనా ప్రభావం పడుతుంది. రైతుల కొనుగోలు శక్తి తగ్గడం వల్ల గ్రామీణ మార్కెట్లలో వ్యాపార లావాదేవీలు మందగించే అవకాశం ఉంది. ఇలా వాతావరణ మార్పుల ప్రభావం ఒక్క వ్యవసాయ రంగానికే పరిమితం కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థలోని అనేక వర్గాలపై పడుతుంది. ముఖ్యంగా పొదుపు లేని కుటుంబాలు, అప్పులపై ఆధారపడే రైతులు, రోజువారీ కూలీలకు ఈ పరిస్థితులు మరింత సవాలుగా మారుతాయి.

తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు అవసరం

వర్షపాతం తగ్గి జలాశయాలు, చెరువులు, కుంటలు, భూగర్భ జలాల్లో నీటి నిల్వలు తగ్గితే తాగునీటి సరఫరాపైనా ప్రభావం పడవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు నీరు, మేత అందుబాటులో లేకపోతే పాడి రైతులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటారు. పశువుల పోషణ ఖర్చులు పెరగడం, పాల దిగుబడి తగ్గడం వల్ల వారి ఆదాయం దెబ్బతినే ప్రమాదం ఉంది.ఈ నేపథ్యంలో తాగునీటి వనరులను సంరక్షించడం, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించడం, చెరువులు, కుంటల్లో నీటి నిల్వలను కాపాడుకోవడం, వర్షపు నీటిని ఒడిసిపట్టే చర్యలు చేపట్టడం అవసరం. సాగునీటి వినియోగంలో ప్రాధాన్యాలను నిర్ణయించి, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి నిర్వహణ చేపట్టాలి.

పేదలకు అండగా నిలవాలి

ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే నష్టాలను తగ్గించేందుకు ప్రభుత్వ శాఖలు ముందస్తు ప్రణాళికతో పనిచేయాల్సిన అవసరం ఉంది. వాతావరణ హెచ్చరికలను రైతులకు చేరవేయడం, పంటల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించడం, తక్కువ నీటితో సాగయ్యే పంటలపై అవగాహన కల్పించడం, అవసరమైన చోట ప్రత్యామ్నాయ పంటల సాగుకు సలహాలు ఇవ్వడం కీలకం. పంట నష్టపోయిన రైతులకు అర్హతల ప్రకారం పంటల బీమా, ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలి. ఉపాధి అవకాశాలు తగ్గిన గ్రామాల్లో అర్హులైన వారికి ఉపాధి హామీ పనులు కల్పించాలి. తాగునీటి సరఫరాకు ఆటంకం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలి. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అర్హులైన కుటుంబాలకు నిత్యావసర సరుకులు సక్రమంగా అందేలా చూడాలి.

ముందస్తు జాగ్రత్తలే పరిష్కారం

ఎల్‌నినో ప్రభావం ఎంత తీవ్రంగా ఉంటుందనేది స్థానిక వర్షపాతం, ఉష్ణోగ్రతలు, జలాశయాల్లో నీటి నిల్వలు, పంటల పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి ముందుగానే ప్రజల్లో ఆందోళనలు పెంచడం కంటే శాస్త్రీయ అంచనాల ఆధారంగా చర్యలు చేపట్టడం ముఖ్యం. రైతులు కూడా వ్యవసాయ అధికారుల సూచనల మేరకు పంటల ఎంపిక, సాగునీటి వినియోగం, పెట్టుబడుల విషయంలో నిర్ణయాలు తీసుకోవాలి.ప్రకృతి వైపరీత్యాల ప్రభావం అందరిపైనా పడినా, వాటిని తట్టుకునే ఆర్థిక సామర్థ్యం పేదలకు తక్కువగా ఉంటుంది. అందువల్ల వాతావరణ మార్పులను ఎదుర్కొనే ప్రణాళికల్లో పేదలు, రైతులు, వ్యవసాయ కూలీల అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ముందస్తు చర్యలు, నీటి సంరక్షణ, ఉపాధి కల్పన, సమర్థవంతమైన ప్రభుత్వ సహాయం ద్వారానే ఎల్‌నినో ప్రభావంతో పేదల జీవనంపై పడే భారాన్ని కొంతవరకు తగ్గించవచ్చు.

టి.రాజేష్ కుమార్ , చర్ల ప్రజా జ్యోతి రిపోర్టర్



ఎల్ నినో ప్రభావంతో నీటి కొరత ఏర్పడుతున్ననేపథ్యంలో రైతులు వరి, మొక్కజొన్న పంటలకు బదులుగా అపరాలు, మినుములు, పెసర వంటి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని చర్ల మండల వ్యవసాయ అధికారి టీ.రవితేజస్ రెడ్డి సూచించారు. పెసర సాగుకు 50 శాతం సబ్సిడీ అందించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు.పంటలు సరిగా పండక నష్టాలు ఎదురైతే వాటిని గుర్తించి ప్రభుత్వపరంగా పరిహారం అందేలా చూస్తామని మండలంలో ప్రస్తుతం 16 వేల ఎకరాల్లో వరి, 5,800 ఎకరాల్లో మిరప, 5,200 ఎకరాల్లో పత్తి సాగవుతున్నాయని నీటి కొరతను దృష్టిలో ఉంచుకొని రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై ఆలోచించి, అందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని ఆయన కోరారు.

మేడి అఖిల్ హత్య కేసులో కదలిక..!

- మరో ముగ్గురు యువకులు అరెస్ట్...
- ఎదురుగడ్డ హత్య కేసులో పోలీసుల దూకుడు...
- అఖిల్ హత్య కేసులో మూడు ఫోన్లు స్వాధీనం.. దర్యాప్తు ముమ్మరం..!
- మొత్తంగా లక్ష్మీదేవిపల్లి హత్య కేసులో ఏడుగురు అరెస్ట్..!

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి. నవంబర్ 3, (ప్రజాజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సంచలనం సృష్టించిన మేడి అఖిల్ హత్య కేసులో పోలీసులు దూకుడు పెంచారు. లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎదురుగడ్డ గ్రామానికి చెందిన అఖిల్ హత్య కేసులో మరో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ ఆధ్వర్యంలో దర్యాప్తు ముమ్మరంగా చేపట్టారు. ఇందులో భాగంగా ఈ హత్యలో ప్రమేయం ఉన్న ఎదురుగడ్డ గ్రామానికి చెందిన సురేష్, పవన్, వినోద్ లను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అరెస్ట్ చేసిన ముగ్గురిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్ కు తరలించారు. వారి వద్ద నుంచి మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికే ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేయగా, తాజాగా మరో ముగ్గురితో కలిపి మొత్తం నిందితుల సంఖ్య ఏడుకు చేరింది. నిందితుల పాత్రపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవిపల్లి ఎస్సై అఖిల, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టులపై కక్ష సాధింపు చర్యలు ఆపాలి!

- క్రమార్కులకు అండగా నిలుస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి
- ప్రజాజ్యోతికి ప్రజా సంఘాలు, విద్యార్థి యువజన సంఘాల అండ ఉంటుంది: కోట శివశంకర్



కొత్తగూడెం, నవంబర్ 3, ప్రజా జ్యోతి : సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను వెలుగులోకి తీసుకొస్తూ నీతి, నిజాయితీతో వార్తలు ప్రచురిస్తున్న ప్రజా జ్యోతి పత్రిక యాజమాన్యంపై, విలేకరులు, సీనియర్ జర్నలిస్టులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం, మానసికంగా వేధించడం, పరువు నష్టం దావాల పేరుతో బెదిరింపులకు దిగడం దారుణమని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి కోట శివశంకర్ అన్నారు. రాజకీయ ముసుగులో కొందరు వ్యాపారులు, రియల్ ఎస్టేట్ అక్రమార్కులు ప్రజల ఆస్తులకు సంబంధించిన అక్రమాలకు పాల్పడుతున్నారని, వాటిని అరికట్టాల్సిన కొందరు అధికారులు అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇలాంటి వ్యవహారాలను వెలుగులోకి తీసుకొచ్చే మీడియాపై ఒత్తిళ్లు తీసుకురావడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను, అన్యాయాలను అక్షరరూపంలో సమాజం ముందుకు తీసుకురావడం జర్నలిస్టుల బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే పత్రికలు, జర్నలిస్టులను భయపెట్టే ప్రయత్నాలను సహించేది లేదన్నారు. ప్రజాజ్యోతి యాజమాన్యానికి, ఆ పత్రికలో పనిచేస్తున్న విలేకరులకు ప్రజా సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాలు అండగా నిలుస్తాయని, అవసరమైతే ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ వెంటనే స్పందించి మీడియాను, జర్నలిస్టులను బెదిరిస్తున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోట శివశంకర్ డిమాండ్ చేశారు.

మేదర బస్తి లో ప్రాథమిక ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్

- విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి ఉత్తమ ఫలితాలు సాధించాలి, జిల్లా కలెక్టర్ అంకిత్





కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 3 ,(ప్రజా జ్యోతి) కొత్తగూడెం మేదరబస్తీలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య, రోజువారీ హాజరు శాతం, ఉపాధ్యాయుల హాజరు, బోధనా విధానాలు, విద్యా ప్రమాణాల అమలు తదితర అంశాలపై ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు నిర్దేశిత అభ్యసన లక్ష్యాలను సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి డిజిటల్ తరగతి గదిని కలెక్టర్ పరిశీలించారు, విద్యార్థులకు అందిస్తున్న డిజిటల్ బోధనా విధానాలను సమీక్షించారు. అనంతరం విద్యార్థులతో నేరుగా మాట్లాడి ఇప్పటివరకు పూర్తయిన సిలబస్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల పాఠ్యాంశాలపై అవగాహన, చదివే సామర్థ్యం, అభ్యసన స్థాయిని పరిశీలించారు. నిర్ణీత గడువులోగా సిలబస్ పూర్తి చేయడంతో పాటు ప్రతి విద్యార్థికి పాఠ్యాంశాలపై పూర్తి అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతుల ద్వారా వారి అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరచాలని ఆదేశించారు.గత సంవత్సరం పదవ తరగతిలో 86 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ప్రధానోపాధ్యాయులు కలెక్టర్‌కు వివరించగా, ఈ ఏడాది ఉత్తీర్ణత శాతాన్ని మరింత పెంచేలా ప్రణాళికాబద్ధంగా బోధన చేపట్టాలని సూచించారు.అనంతరం ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడి వారి పాఠ్యపుస్తకాలను పరిశీలించారు. విద్యార్థుల చదివే సామర్థ్యం, పాఠ్యాంశాలపై అవగాహన, అభ్యసన స్థాయిని స్వయంగా పరీక్షించారు. విద్యార్థులు చదవడం, రాయడం, గణితంలో ప్రాథమిక నైపుణ్యాలు సాధించేలా ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి విద్యార్థి విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా బోధనలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.మధ్యాహ్న భోజన పథకం అమలును కలెక్టర్ పరిశీలించారు, విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన, పోషక విలువలతో కూడిన భోజనం అందించాలని, ఆహార తయారీలో పరిశుభ్రత ప్రమాణాలు పాటించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట తాసిల్దార్ పుల్లయ్య, ప్రధానోపాధ్యాయులు బి వి ఎల్ కుమార్, బోధన బోధ నేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

క్షణం కోపం.. రెండు కుటుంబాల్లో జీవితాంతం కన్నీరు..!

- ఆగి ఉంటే బాగుండేది.. బస్సు గొడవ నేర్పిన పెను విషాదం..!
- ఎవరూ గెలవలేదు.. ఇద్దరూ ఓడారు.. మణుగూరు బస్సు ఘటన మిగిలింది శోకమే..!
- సహనం ఉంటే ప్రాణం నిలిచేది.. కన్నవారికి దూరం తప్పేది..!



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి , మణుగూరు. నవంబర్ 3, (ప్రజాజ్యోతి) : -ఒక్క నిమిషం సహనం పాటించి ఉంటే రెండు కుటుంబాలు ఇలా కన్నీటి పాలయ్యేవి కావు. బస్సు ప్రయాణంలో మొదలైన చిన్న మాట పెద్ద గొడవగా మారి చివరకు తీరని విషాదాన్ని మిగిల్చింది. ఆర్టీసీ ఉద్యోగం చేసుకుంటూ కుటుంబానికి అండగా నిలుస్తున్న ఒక మహిళా కండక్టర్ ప్రవళిక ప్రస్తుతం తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె కోసం కుటుంబ సభ్యులు కంటి మీద కునుకు లేకుండా ఎదురుచూస్తున్నారు. మరోవైపు అదే ఘటనకు సంబంధించి ఇద్దరు పసిపిల్లల తల్లి నిర్బంధంలో ఉంది.ఇంటి వద్ద ఆచిన్నారులు అమ్మ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్న దృశ్యం ప్రతి ఒక్కరి గుండెను కలచివేస్తోంది. ఈ ఘటనలో ఎవరూ గెలవలేదు. ఇద్దరూ ఓడిపోయారు. దీంతో రెండు కుటుంబాల్లో మిగిలింది కన్నీరే. చిన్న విషయానికి పెద్దగా స్పందించడం, కోపాన్ని అదుపు చేయలేకపోవడం ఎంత ప్రమాదమో ఈ బస్సు ఘటన రుజువు చేసింది. సమాజానికి ఇదొక హెచ్చరికలాగా తెలుస్తోంది. వివాదం ఎదురైనప్పుడు ఒక్క అడుగు వెనక్కి వేయడం ఓటమి కాదు, అదే పెద్ద మనసు. కానీ కోపం కొన్ని క్షణాలు మాత్రమే ఉంటుంది, కానీ దాని పర్యవసానం జీవితాంతం వెంటాడుతోంది.

ప్రభుత్వ పాఠశాలలో జ్ఞాన సరస్వతి విగ్రహావిష్కరణ


- విద్యార్థులకు విద్యా సామగ్రి, ఆయాలకు చీరల పంపిణీ
- వాసవి క్లబ్ భద్రాచలం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు



భద్రాచలం, నవంబర్ 3 (ప్రజా జ్యోతి): వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు సిద్ధ వెంకట సూర్య ప్రకాశరావు సద్భావన పర్యటన సందర్భంగా వాసవి క్లబ్ భద్రాచలం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో శ్రీ జ్ఞాన సరస్వతి దేవి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమానికి క్లబ్ అధ్యక్షుడు వనమా కిరణ్ కుమార్ అధ్యక్షత వహించగా, అంతర్జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, జిల్లా గవర్నర్ చారుగుళ్ల శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సిద్ధ వెంకట సూర్య ప్రకాశరావు మాట్లాడుతూ విద్యార్థులు అమ్మవారి ఆశీస్సులతో చదువులో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు జామెట్రీ సామగ్రి, పెన్నులు, బిస్కెట్లు, చాక్లెట్లు, మధ్యాహ్న భోజన సిబ్బందికి చీరలు పంపిణీ చేశారు. ఆంజనేయస్వామి పార్కులో సందర్శకుల కోసం రెండు సిమెంట్ బల్లలను వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో రుద్ర వినోద్ కుమార్, రేపాక ధనుంజయ రాజ మనోహర్, ఉడతా నగేష్ కుమార్, పెనుగొండ సంతోష్, నాలా సాయిచంద్, బండారు కృష్ణయ్య, బచ్చు సాగర్, గుడుమాసు వెంకట సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కారం పాపయ్య, ఉపాధ్యాయులు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

జనజాతి గౌరవ దివస్ కార్యక్రమాల వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలి

- ఆది ప్రసరణ్ పోర్టల్ వినియోగంపై అధికారులకు అవగాహన



భద్రాచలం, నవంబర్ 3 (ప్రజా జ్యోతి): జనజాతి గౌరవ దివస్–2026 సందర్భంగా నవంబర్ 1 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాల వివరాలను కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన ఆదిప్రసరణ్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్ టెక్నికల్ మేనేజర్ ఆమోల్ రాజ్ సూచించారు.మంగళవారం కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆన్‌లైన్ అవగాహన, శిక్షణ కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ బి. రాహుల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోర్టల్‌లో లాగిన్ విధానం, కార్యక్రమాల వివరాలు, ఫొటోలు, వీడియోలను అప్‌లోడ్ చేసే పద్ధతిని వివిధ రాష్ట్రాల అధికారులకు ఆమోల్ రాజ్ వివరించారు.ప్రతి కార్యక్రమానికి సంబంధించిన సమాచారాన్ని నిర్ణీత సమయంలో సమగ్రంగా నమోదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో భద్రాచలం ఐటీడీఏ ఏపీఓ జనరల్ పాల్గొని అవసరమైన సూచనలు, వివరాలను తెలుసుకున్నారు.

మురసు తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

- అత్యవసర సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ఫోన్ నంబర్ ఏర్పాటు
- భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ



భద్రాచలం, నవంబర్ 3 (ప్రజా జ్యోతి): మురసు తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రానున్న 48 గంటల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ తెలిపారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.భద్రాచలం డివిజన్ పరిధిలోని మండలాలు, గ్రామాల్లో తుఫాన్ ప్రభావంతో ఎలాంటి సమస్యలు ఎదురైనా ప్రజలు కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. ఇందుకోసం 08743-232444 నంబర్‌ను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.భారీ వర్షాల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాల ప్రజలు వర్షాలు తగ్గేవరకు ఇళ్లలోనే ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు. అనవసర ప్రయాణాలను పూర్తిగా నివారించాలని, తప్పనిసరి పరిస్థితుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్ డీవీ శంకరరావుకు ఎస్‌బీఐలో ఘన సన్మానం

- 73 ఏళ్ల వయస్సులోనూ ప్రపంచ స్థాయిలో పతకాల సాధన



భద్రాచలం, నవంబర్ 3 (ప్రజాజ్యోతి): అమెరికాలోని రెనో నగరంలో జరిగిన ప్రపంచ మాస్టర్స్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో రజత, కాంస్య పతకాలు సాధించిన రిటైర్డ్ ఎస్‌బీఐ అధికారి డీవీ శంకరరావును హైదరాబాద్‌లోని స్టేట్ బ్యాంక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎస్‌బీఐఆర్‌డీ)లో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ సోమనాథ్ అధ్యా, ఏజీఎంలు కె.వి. రామారావు, పద్మనాభన్ పిళ్లై, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొని శంకరరావును అభినందించారు. 2012లో గుండెకు బైపాస్ శస్త్రచికిత్స జరిగినప్పటికీ, పదవీ విరమణ అనంతరం పవరలఫ్టింగ్‌లో ప్రవేశించిన ఆయన 2025లో కేరళలో జరిగిన జాతీయ పోటీల్లో నాలుగు స్వర్ణ పతకాలతో పాటు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించారు. తాజాగా రెనోలో జరిగిన ప్రపంచ పోటీల్లో మాస్టర్స్-4, 74 కిలోల విభాగంలో అక్టోబర్ 15న క్లాసిక్ విభాగంలో కాంస్యం, అక్టోబర్ 22న ఎక్విప్డ్ విభాగంలో రజత పతకం గెలుచుకున్నారు. ప్రస్తుతం పాల్వంచ ఎస్‌బీఐ ఆర్‌ఏసీపీసీలో ఆడిట్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శంకరరావును కార్యక్రమానికి హాజరైన చార్టర్డ్ అకౌంటెంట్లు, ఆడిట్ సిబ్బంది అభినందించారు. 73 ఏళ్ల వయస్సులోనూ పట్టుదల, క్రమశిక్షణతో అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం యువతకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

టీఆర్ఎస్ (డి) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి

- మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా నియామకం..
- ఉత్తర్వులు జారీ చేసిన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నరాల సత్యనారాయణ



భద్రాచలంనవంబర్ 3 (ప్రజా జ్యోతి): తెలంగాణరక్షణ సమితి (డి) పార్టీరాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, ఎన్నికల మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా ప్రముఖ రాజకీయ నాయకుడు, సామాజిక సేవకుడు డాక్టర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డిని నియమించినట్లు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నరాల సత్యనారాయణ వెల్లడించారు. పార్టీ నిర్మాణం, బలోపేతంలో భాగంగా ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల్లో విస్తృత పరిచయాలు కలిగిన శంకర్‌రెడ్డి, రెండు తెలుగు రాష్ట్రాల్లో రోటరీ ఇంటర్నేషనల్ గవర్నర్‌గా విశిష్ట సేవలందించారని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా కాంగ్రెస్ సుదీర్ఘకాలం రాజకీయాల్లో పనిచేశారని తెలిపారు. రానున్న శాసనమండలి ఎన్నికల్లో నల్గొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గం నుంచి టీఆర్ ఎస్ (డి) అభ్యర్థిగా శంకర్‌రెడ్డికి అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజా సంఘాలు, అధ్యాపక, విద్యార్థి, ఉపాధ్యాయ, న్యాయవాద సంఘాల నుంచి పార్టీకి మద్దతు లభిస్తోందని నరాల సత్యనారాయణ పేర్కొన్నారు. పార్టీ నియమ నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తూ కార్యకర్తల సమన్వయం, పార్టీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించినట్లు తెలిపారు.

తప్పుడు పట్టాలు చేయడంలో పినపాక మండలం దిట్టా.!

- ఎమ్మార్వో కార్యాలయం నుంచే కలెక్టర్‌కు ఫిర్యాదు
- 2026 ఫిబ్రవరిలోనే పట్టా రద్దుకు సిఫార్సు.. అయినా చర్యలేవీ?
- బాధితుడికి న్యాయం చేయడంలో ఎందుకీ నిర్లక్ష్యం?
- పినపాక మండలంలో మరిన్ని పట్టాలపై అనుమానాలు.. సమగ్ర విచారణకు డిమాండ్





పినపాక, నవంబర్ 03 (ప్రజాజ్యోతి): దుగినేపల్లి గ్రామంలోని భూ వ్యవహారం పినపాక మండల రెవెన్యూ శాఖలో తీవ్ర చర్చనీయాంశంగా మారుతోంది. దశాబ్దాల క్రితం కొనుగోలు చేసిన భూమికి సంబంధించి పాత రెవెన్యూ రికార్డులు, కోర్టు పత్రాలు ఒకవైపు ఉండగా.. అనంతరం అదే భూమికి పట్టా మార్పులు జరగడం పలు అనుమానాలకు తావిస్తోంది. తాజాగా ఈ వ్యవహారంలో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. సదరు ఎమ్మార్వో కార్యాలయం నుంచే ఈ పట్టా తప్పుడు పట్టా అని పేర్కొంటూ, దాన్ని రద్దు చేయాలని 2026 ఫిబ్రవరి నెలలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు పంపినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ ఇప్పటివరకు పట్టా రద్దు కాకపోవడం, బాధితుడికి న్యాయం జరగకపోవడం పలు ప్రశ్నలకు దారితీస్తోంది.

›» ఇంటిపేరు ఒక్కటే ఆధారం.. పట్టా మార్పు ఎలా?

దుగినేపల్లి గ్రామానికి చెందిన సదరు భూమి వ్యవహారంలో పాత యజమానుల పేర్లు, అనంతరం రెవెన్యూ రికార్డుల్లో నమోదైన పేర్ల మధ్య ఇంటిపేరు ఒకటిగా ఉండటాన్ని ఆధారంగా చేసుకుని పట్టా మార్పు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే కేవలం ఇంటిపేరు ఒకటిగా ఉన్నంత మాత్రాన భూమిపై హక్కులు నిర్ధారణ అవుతాయా? వారసత్వ సంబంధాన్ని నిర్ధారించే పత్రాలు, రిజిస్ట్రేషన్ ఆధారాలు, కుటుంబ వివరాలు పరిశీలించకుండా పట్టా మార్పు చేశారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. 1954లో కందిమల్ల మాణిక్యం సుంకర ముత్తయ్య నుంచి భూమిని కొనుగోలు చేసినట్లు కోర్టులో దాఖలైన పత్రాల్లో పేర్కొన్నట్లు గతంలో ప్రచురించిన కథనంలో వివరించాం. కొనుగోలు అనంతరం ఆయన పేరు రెవెన్యూ రికార్డుల్లో అనుభవదారు కాలమ్‌లో నమోదైనట్లు కూడా కోర్టు పత్రాల్లో ప్రస్తావన ఉంది. మరి అలాంటి భూమికి అనంతరం పట్టా మార్పు జరిగితే దానికి సంబంధించిన ఆధారాలు ఏమిటన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.

›» ఇళ్లు.. మల్లన్న ఆలయం ఉన్న స్థలానికి పట్టా ఎలా?

సదరు భూమిలో ఇల్లు, మల్లన్న స్వామి ఆలయం, పశువుల కొట్టం ఉన్నట్లు కోర్టు పిటిషన్‌లో పేర్కొన్న వివరాలు ఉన్నాయి. అంతేకాకుండా 1960లో రెండు పొగాకు బేరన్ల నిర్మాణానికి గ్రామపంచాయతీ అనుమతి ఇచ్చినట్లు పాత పత్రాల్లో ప్రస్తావన ఉంది. ఇంతటి చరిత్ర కలిగిన భూమికి వ్యవసాయ పట్టా ఎలా జారీ చేశారు? భూమి వాస్తవ వినియోగాన్ని అధికారులు పరిశీలించారా? క్షేత్రస్థాయి విచారణ నిర్వహించారా? ఇళ్లు, ఆలయం ఉన్న స్థలానికి పట్టా మార్పు చేసే సమయంలో సంబంధిత నిబంధనలు పాటించారా? అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

›» ఎమ్మార్వో కార్యాలయం నుంచే కలెక్టర్‌కు ఫిర్యాదు

ఈ వ్యవహారంలో తాజాగా వెలుగులోకి వచ్చిన అంశం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. సదరు భూమికి సంబంధించిన పట్టా తప్పుడు పట్టా అని పేర్కొంటూ, దాన్ని రద్దు చేయాలని 2026 ఫిబ్రవరి నెలలో ఎమ్మార్వో కార్యాలయం నుంచే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు పంపినట్లు సమాచారం. అయితే ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. పట్టా తప్పుడు పట్టా అని గుర్తించి, దాన్ని రద్దుచేయాలని సంబంధిత రెవెన్యూ కార్యాలయం నుంచే కలెక్టర్‌కు ఫిర్యాదు పంపినట్లయితే.. ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదు? ఆ ఫిర్యాదుపై కలెక్టర్ కార్యాలయంలో ఎలాంటి విచారణ జరిగింది? పట్టా రద్దుకు సంబంధించిన ఫైలు ప్రస్తుతం ఏ దశలో ఉంది? బాధితుడికి న్యాయం చేయడంలో ఎందుకీ జాప్యం జరుగుతోంది? అన్న ప్రశ్నలకు సమాధానం రావాల్సి ఉంది.

›» తప్పుడు పట్టా వెనుక అధికారుల పాత్ర ఉందా?

పట్టా మార్పు ప్రక్రియలో అప్పట్లో విధులు నిర్వహించిన రెవెన్యూ అధికారుల పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తప్పుడు పట్టా జారీ చేయడానికి ఎలాంటి పత్రాలను ఆధారంగా తీసుకున్నారు? దరఖాస్తు చేసిన వ్యక్తి సమర్పించిన ఆధారాలు నిజమైనవేనా? పాత రెవెన్యూ రికార్డులను పరిశీలించారా? సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేశారా? విచారణ నివేదిక ఆధారంగా పట్టా మార్పు చేశారా? అన్న అంశాలు తేలాల్సి ఉంది. ఈ ప్రక్రియలో ఎవరికైనా ఆర్థిక ప్రయోజనాలు కల్పించారా? కమిషన్లు లేదా ఇతర లావాదేవీలు జరిగాయా? అన్న అనుమానాలు కూడా స్థానికంగా వినిపిస్తున్నాయి. అయితే వీటిపై ఇప్పటివరకు ఎలాంటి నిర్ధారణ లేదు. సంబంధిత ఫైళ్లు, విచారణ నివేదికలు, అవసరమైన లావాదేవీల వివరాలను పరిశీలిస్తేనే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

›» పినపాక మండలంలో మరిన్ని తప్పుడు పట్టాలున్నాయా?

దుగినేపల్లి భూ వ్యవహారం వెలుగులోకి రావడంతో పినపాక మండలంలో గతంలో జరిగిన పట్టా మార్పులపై కూడా చర్చ మొదలైంది. ఒకే ఇంటిపేరు ఆధారంగా ఇతర భూములకు కూడా పట్టాలు మార్పు చేశారా? పాత రికార్డులను పక్కనపెట్టి కొత్త పేర్లను నమోదు చేశారా? ప్రభుత్వ భూములు, వివాదాస్పద భూముల విషయంలోనూ ఇలాంటి అక్రమాలు జరిగాయా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మండలవ్యాప్తంగా గతంలో జరిగిన పట్టా మార్పులపై సమగ్ర పరిశీలన చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా అనుమానాస్పద పట్టాల జారీకి సంబంధించిన రికార్డులను పరిశీలిస్తే మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అంటున్నారు.

›» కలెక్టర్ జోక్యం చేసుకుని న్యాయం చేయాలి

2018లో సదరు భూమిపై O.S.No.156/2018 కేసు నమోదైనట్లు, దానికి అనుబంధంగా I.A.No. 146/2018లో తాత్కాలిక ఇంజంక్షన్ ఉత్తర్వులు జారీ అయినట్లు గతంలో ప్రచురించిన కథనంలో పేర్కొన్నాం. కోర్టు వివాదం, పాత రెవెన్యూ రికార్డులు, పట్టా మార్పు, 2026 ఫిబ్రవరిలో పట్టా రద్దుకు ఎమ్మార్వో కార్యాలయం నుంచే పంపిన ఫిర్యాదు.. ఈ అంశాలన్నింటినీ సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పట్టా మార్పునకు సంబంధించిన పూర్తి ఫైళ్లను పరిశీలించాలి. తప్పుడు పట్టా జారీ చేసినట్లు తేలితే బాధ్యులైన అధికారులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు, అక్రమంగా పట్టా పొందినట్లు నిర్ధారణ అయిన వ్యక్తులపై కూడా చట్టపరమైన చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా అన్యాయం జరిగిన బాధితుడికి న్యాయం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. 2026 ఫిబ్రవరిలోనే పట్టా రద్దుకు ఎమ్మార్వో కార్యాలయం నుంచి కలెక్టర్‌కు ఫిర్యాదు వెళ్లినట్లు చెబుతున్న నేపథ్యంలో.. ఇంతకాలం చర్యలు ఎందుకు తీసుకోలేదు? బాధ్యులపై చర్యలు ఎప్పుడు? బాధితుడికి న్యాయం ఎప్పుడనే ప్రశ్నలకు జిల్లా కలెక్టర్ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

పోలీస్ శిక్షణ తీసుకుంటేనే కాంపిటేటివ్ పరీక్షలకు సిద్ధం కావాలి

- ఐటిడిఏ పీవో బి. రాహుల్



భద్రాచలం, నవంబర్ 3 (ప్రజా జ్యోతి): నిరుద్యోగ గిరిజన యువతీ యువకులు ఐటీడీఏ ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత పోలీసు శిక్షణను సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు సాధించి జీవితంలో స్థిరపడాలని ఐటీడీఏ పీవో బి.రాహుల్ సూచించారు. మంగళవారం ఐటీడీఏ ప్రాంగణంలోని పీఎంఆర్‌సీ భవనంలో నిర్వహిస్తున్న పోలీసు శిక్షణ శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. శిక్షకులు బోధిస్తున్న పాఠాలను యువతతో కలిసి కూర్చొని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్రతో పాటు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సరిహద్దు గాంధీ ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్, సరోజినీ నాయుడు వంటి ప్రముఖుల జీవిత చరిత్రలను శ్రద్ధగా నేర్చుకోవాలని సూచించారు. పాఠాలు వింటున్నప్పుడు ముఖ్యాంశాలను నోట్స్ రూపంలో రాసుకోవాలని, ప్రతిరోజూ నేర్చుకున్న అంశాలను రాత్రిపూట మరోసారి పునశ్చరణ చేసుకోవాలని తెలిపారు. దీనివల్ల జ్ఞాపకశక్తి పెరిగి పరీక్షలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవచ్చన్నారు. పోలీసు శారీరక శిక్షణతోపాటు పోటీ పరీక్షలకు సంబంధించిన అంశాలపై కూడా అధ్యాపకులను అడిగి తెలుసుకోవాలని, సమయాన్ని వృథా చేయకుండా క్రమశిక్షణతో సాధన చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ లక్ష్యాన్ని నిర్దేశించుకొని పోలీసు ఉద్యోగాలు సాధించే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీఈటీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ వీరు నాయక్, ఏసీఎంవో రమేష్, కేర్‌టేకర్ సర్వేశ్వర్ దొర, వార్డెన్ మోహన్, పీడీలు వసంతం, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

- నమ్మకానికి పాతర వేసి ప్రభుత్వ ధాన్యం మాయం.. 'శ్రీజ' యజమాని ఘరానా దందా!
- 2025–2026 సిఎంఆర్ రైస్ కి సంభందించి ప్రభుత్వానికి టోకర
- కోట్ల రూపాయల ధాన్యాన్ని పంది కొక్కుల మింగేసాడు..!
- అసలు + 25% పెనాల్టీతో కలిపి మొత్తం రూ. 6.91 కోట్లుగా తేలిన లెక్క..
- కాంగ్రెస్ 'రాష్ట్ర నాయకుడి' ముసుగులో తిరిగిన పెద్దమనిషి అసలు భాగోతం బట్టబయలు!
- మంత్రి పొంగులేటి పేరును అడ్డు పెట్టుకొని ప్రభుత్వాన్నే మోసగించిన వైనం
- ఘరానా మోసంపై క్రిమినల్ కేసు నమోదు.. ప్రస్తుతం అరెస్ట్ భయంతో పరారీలో అక్రమార్కుడు!
- వెంటనే అరెస్ట్ చేసి జైలుకు పంపాలని ప్రజలు, ప్రజాసంఘాల ఉవ్వెత్తున డిమాండ్!



'ఆళ్ల మురళి' మెక్కింది.. 17,500 క్వింటాళ్లు!

● భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ప్రజాజ్యోతి

రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి పేదలకు బియ్యంగా అందించాలని ప్రభుత్వం ఇచ్చిన నమ్మకానికి 'శ్రీజ రైస్ మర్చంట్' యజమాని ఆళ్ల మురళీగోపాలకృష్ణ దారుణంగా పాతర వేశాడు! పౌరసరఫరాల శాఖ ఎంతో నమ్మకంతో 2025 – 2026 సంవత్సరానికి సంబంధించి కేటాయించిన ఏకంగా 17,500 క్వింటాళ్ల వడ్లను (ధాన్యాన్ని) మిల్లులో ఉంచకుండా పందికొక్కులా మెక్కేశాడు.

రాజకీయ అండపై వెల్లువెత్తుతున్న ఆరోపణలు!

శ్రీజ రైస్ మర్చంట్ యజమాని ఆళ్ల మురళీగోపాలకృష్ణ సాగించిన రూ. 6.91 కోట్ల సీఎంఆర్ బియ్యం దందా వెనుక ఆయన ప్రదర్శించిన ధీమానే ఇప్పుడు ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి జిల్లాకు చెందిన రాష్ట్రమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, భద్రాద్రి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు దేవి ప్రసన్నతో ఉన్న పరిచయాలను, పేరును అడ్డుపెట్టుకుని మురళీగోపాలకృష్ణ ఈ రకమైన తెగింపునకు ఒడిగట్టాడనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సదరు నేతల జిల్లా పర్యటనలప్పుడు ఇతనే కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, "నా వెనుక పెద్దలు ఉన్నారు.. నన్ను ఎవరూ ఏమీ చేయలేరు" అనే రేంజ్‌లో ధీమా ప్రదర్శిస్తూ ఈ అక్రమాలకు తెగబడ్డాడని రాజకీయ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. ఇలా పెద్దల పేరును అడ్డుపెట్టుకుని ఏకంగా 17,500 క్వింటాళ్ల ప్రభుత్వ బియ్యాన్ని నల్ల మార్కెట్‌కు మళ్లించి, తీరా పౌరసరఫరాల శాఖ తనిఖీల్లో దొరికిపోయినా "అది చిన్న పొరపాటు" అంటూ బుకాయించే స్థాయికి ఆ తెగింపు చేరింది. అయితే సొంత పార్టీ పేరును, పెద్దల పరిచయాలను వాడుకుంటూ ఒక మిల్లర్ ఇలా కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని మింగేయడం కాంగ్రెస్ శ్రేణుల్లోనే తీవ్ర అసంతృప్తికి దారితీస్తోంది. అయితే ఇక్కడే మరో సంచలనాత్మకమైన చర్చ కూడా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొదలైంది. సరిగ్గా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదినం నాడే సదరు రైస్ మిల్లుపై పౌరసరఫరాల అధికారుల ఆకస్మిక తనిఖీలు జరపడం తీవ్ర సంచలనం రేకెత్తిస్తోంది. మంత్రి పుట్టినరోజు వేడుకలు, పర్యటనలు సాగుతున్న సమయాన.. ఆయనతో ఫోటోలు దిగుతూ పెద్దమనిషిలా తిరిగే మురళి మిల్లుపై అధికారుల దాడి జరగడం వెనుక "ఏదో పెద్ద తేడానే జరుగుతోంది" అని జిల్లా ప్రజలు, రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. పుట్టినరోజు నాడే ఈ ఘరానా భాగోతం ఆధారాలతో సహా బయటపడటం వెనుక అంతర్గత రాజకీయ సమీకరణాలా లేక అధికారుల సమర్థవంతమైన చర్యలా అనే కోణంలో సరికొత్త అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రాష్ట్ర నాయకుడి ముసుగు ఊడిపోయింది!

ఇన్నాళ్లూ జిల్లాలో, రాష్ట్రంలో తాను "కాంగ్రెస్ పార్టీ పెద్ద రాష్ట్ర నాయకుడిని"అంటూ చొక్కామడతలేసి సమాజంలో పెద్దమనిషిలా చలామణి అయిన ఆళ్ళ మురళీ అసలు భాగోతం ఇప్పుడు ఒక్కసారిగా బయటపడింది. రాజకీయ పదవుల ముసుగు వేసుకుని తిరుగుతూ..వెనుక మాత్రం పేద ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ ధాన్యాన్ని పందికొక్కులా మెక్కడం ఆయన నీచ నైజానికి అద్దం పడుతోందని ప్రజాసంఘాలు మండిపడుతున్నాయి. రాజకీయ నాయకుడి ముసుగులో సాగించిన ఈ కోట్లాది రూపాయల దోపిడీ ఆకస్మిక తనిఖీల్లో దొరికిపోవడంతో ఆయన వేసుకున్న పెద్దమనిషిముసుగు పూర్తిగా ఊడిపోయింది. ఇంతటి ప్రభుత్వ ధాన్యాన్ని పక్కదారి పట్టించి కోట్ల రూపాయలు కొల్లగొట్టిన ఈ ఘరానా దందాపై పౌరసరఫరాల శాఖ అధికారుల ఫిర్యాదు మేరకు ఆళ్ల మురళీగోపాల కృష్ణపై చట్టరీత్యా క్రిమినల్ కేసులు నమోదు అయ్యాయి. కేసు నమోదు కావడం, రాజకీయ ముసుగు కూడా ఊడిపోవడంతో తీవ్ర భయాందోళనకు గురైన సదరు మిల్లర్, పోలీసుల అరెస్ట్ నుంచి తప్పించుకోవడానికి ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. అధికార యంత్రాంగాన్ని, చట్టాన్ని సైతం బొటనవేలితో నెట్టేయవచ్చని భావించిన ఈ ఘరానా అక్రమార్కుడు, తీరా క్రిమినల్ కేసులు మెడకు చుట్టుకోవడంతో ఎక్కడ పోలీసులు అరెస్ట్ చేసి జైల్లో పెడతారోనన్న భయంతో పారిపోయి దాక్కున్నాడని ప్రచారం సాగుతోంది.

మొత్తం రూ. 6.91 కోట్లు కక్కాల్సిందే..!

ఇలా పారిపోయి దాక్కున్నంత మాత్రాన సదరు అక్రమార్కుడు చట్టం నుంచి తప్పించుకోలేడని పౌరసరఫరాల శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వ ధాన్యాన్ని పక్కదారి పట్టించినందుకు గాను పౌరసరఫరాల చట్టాల ప్రకారం మాయం చేసిన ధాన్యం అసలు విలువతో పాటు అదనంగా వేసే 25 శాతం భారీ పెనాల్టీ (జరిమానా) తో కలిపి మొత్తం రూ. 6.91 కోట్లను నికరంగా ఖజానాకు కక్కాల్సిందేనని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ మొత్తం చెల్లించకపోతే రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద మిల్లుతో పాటు ఆయన సొంత ఆస్తులన్నింటినీ వేలం వేసి పైసాతో సహా వసూలు చేస్తామని అధికారులు తేల్చి చెబుతున్నారు.

ఇక ప్రజాధనాన్ని పందికొక్కులా మెక్కి, క్రిమినల్ కేసులు నమోదు కావడంతో పారిపోయిన ఆళ్ల మురళీగోపాలకృష్ణను ఎంతమాత్రం విడిచిపెట్టకూడదని ప్రజాసంఘాలు, ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. పరారీలో ఉన్న సదరు మిల్లర్ కోసం ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దించి తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద ఆయన మిల్లును, సొంత ఆస్తులను జప్తు చేసి పెనాల్టీతో సహా రూ. 6.91 కోట్ల మొత్తాన్ని రికవరీ చేయడంతో పాటు, సదరు మిల్లర్‌ను జైలు కటకటాల వెనక్కి నెట్టాలని ఉమ్మడి జిల్లా ప్రజలు కోరుతున్నారు.

చర్ల పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీ

● కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి-ఎస్‌డీపీవో





చర్ల, నవంబర్ 03:(ప్రజా జ్యోతి): భద్రాచలం సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ (ఎస్‌డీపీవో) మంగళవారం చర్ల పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని సాధారణ నిర్వహణ, స్టేషన్ రికార్డులు, క్రైమ్ రిజిస్టర్లు, కేసు డైరీలు, పెండింగ్ దర్యాప్తు ఫైళ్లు తదితర ముఖ్యమైన రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతిని సమీక్షించి, కేసులను త్వరితగతిన పూర్తి చేసి సకాలంలో పరిష్కరించేందుకు సంబంధిత దర్యాప్తు అధికారులకు పలు సూచనలు చేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత నిస్తూ నేరాల నివారణకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నిరంతర గస్తీ నిర్వహిస్తూ అసాంఘిక శక్తులపై నిఘా పెంచాలని ప్రజలతో సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. పోలీస్ సిబ్బంది విధుల్లో క్రమశిక్షణ పాటించాలని రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని తెలిపారు. పోలీస్ సిబ్బంది అంకిత భావం, క్రమశిక్షణ, వృత్తి నైపుణ్యంతో పాటు ప్రజా సేవపట్ల నిబద్ధతతో విధులు నిర్వహించాలని ఎస్‌డీపీవో సూచించారు. ఈ వార్షిక తనిఖీ కార్యక్రమంలో చర్ల పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓతో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అద్దె ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన టేకు కలప దిమ్మలు స్వాధీనం


- భద్రాచలంలో అటవీశాఖ అధికారుల దాడులు
- లక్ష రూపాయల విలువైన కలప పట్టివేత



భద్రాచలం, నవంబర్ 03 (ప్రజా జ్యోతి): పట్టణంలో అక్రమంగా నిల్వ ఉంచిన టేకు కలప దిమ్మలను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు భద్రాచలం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జస్వంత్ తన సిబ్బందితో కలిసి పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఎదురువీధిలో ఉన్న ఓ అద్దె ఇంటిపై దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు లక్ష రూపాయల విలువ చేసే టేకు కలప దిమ్మలు గుర్తించారు. దీంతో అటవీశాఖ అధికారులు నిబంధనల ప్రకారం కలపను స్వాధీనం చేసుకుని, సీజ్ చేసి ఫారెస్ట్ కార్యాలయానికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, కలప నిల్వకు సంబంధించిన వివరాలపై విచారణ చేపట్టారు. సదరు అద్దె ఇంట్లో మహిళ ఉంటున్నట్లు, ఆమె ఇంట్లోనే టేకు కలప దిమ్మలు లభించినట్లు అధికారులు తెలిపారు. కలపకు సంబంధించి అటవీశాఖ అధికారులు ప్రశ్నించగా, ఆ కలప తనదేనని, దీనికి తానే బాధ్యురాలినని ఆమె అంగీకరించినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. అటవీ సంపదను అక్రమంగా తరలించడం, నిల్వ చేయడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని అటవీశాఖ అధికారులు హెచ్చరించారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదుకు నవంబర్ 6 చివరి తేదీ

- గ్రాడ్యుయేట్లు వెంటనే నమోదు చేసుకోవాలి.
- కాంగ్రెస్ శ్రేణులు చొరవ చూపాలి.
- డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు.



పాల్వంచ, అక్టోబర్ 3, ప్రజాజ్యోతి: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు నవంబర్ 6వ తేదీ చివరి గడువు కావడంతో అర్హులైన పట్టభద్రులు వెంటనే ఓటు నమోదు చేసుకోవాలని డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు కోరారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఓటర్ల నమోదు ప్రక్రియలో చొరవ చూపి అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు అయ్యేలా కృషి చేయాలని సూచించారు. గతంలో ఉన్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాను పూర్తిగా రద్దు చేసిన నేపథ్యంలో పాత, కొత్త పట్టభద్రులు ప్రతి ఒక్కరూ తిరిగి ఓటు నమోదు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 2023 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో యువతకు 75 వేల ఉద్యోగాలు కల్పించిందని పేర్కొన్నారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి పార్టీ శ్రేణులు క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేయాలని కొత్వాల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

పీఎంశ్రీ జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన, ప్రేరణ కార్యక్రమాలు



పాల్వంచ, అక్టోబర్ 3 , ప్రజాజ్యోతి: పీఎంశ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, పాల్వంచలో ఇంటరాక్షన్ విత్ రోల్ మోడల్, జీసీఈఏఎస్‌సీ, లీగల్ లిటరసీ కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు ప్రేరణాత్మక, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇంటరాక్షన్ విత్ రోల్ మోడల్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల పూర్వ విద్యార్థిని, పీహెచ్‌డీ పూర్తి చేసి పాల్వంచ డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ లెక్చరర్‌గా పనిచేస్తున్న జొన్నలగడ్డ మాధవి విద్యార్థులతో ముచ్చటించారు. కెరీర్‌ను ఎలా నిర్మించుకోవాలి, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎలా అధిగమించాలి, సమాజానికి ఆదర్శంగా నిలిచే రోల్ మోడల్స్‌గా ఎలా ఎదగాలి అనే అంశాలపై విద్యార్థులకు విలువైన సూచనలు, ప్రేరణ అందించారు. అదేవిధంగా పాల్వంచ డిగ్రీ కళాశాలలో జువాలజీ లెక్చరర్‌గా పనిచేస్తున్న శ్రీదేవి ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించగా, విమల సైబర్ భద్రత, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తత, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు వివరించారు. అదే పాఠశాల పూర్వ విద్యార్థిని, ప్రస్తుతం అడ్వకేట్‌గా పనిచేస్తున్న డి. కవిత లీగల్ లిటరసీ కార్యక్రమంలో భాగంగా చట్టాలు–మన బాధ్యతలు, టీనేజ్‌లో ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో కెరీర్ పట్ల స్పష్టత, ఆరోగ్యంపై అవగాహన, సైబర్ భద్రతా జాగ్రత్తలు, చట్టాల పట్ల అవగాహన పెంపొందించేలా కృషి చేశారు.

రూ.6.91 కోట్ల ప్రభుత్వ సీఎంఆర్ బియ్యం మాయం

అధికారుల చట్టబద్ధ విధుల వైఫల్యమే

- విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన పౌర సరఫరా అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- నేల వారి తనిఖీలు జాప్యంపై ముడుపులు ముట్టినాయి అనే ఆరోపణ
- సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి భూక్య శ్రీను నాయక్



భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 3, ప్రజాజ్యోతి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం పట్టణానికి చెందిన శ్రీజ రైస్ మర్చంట్స్ మిల్లులో సుమారు 1,750 మెట్రిక్ టన్నుల ప్రభుత్వ కస్టమ్ మిల్లింగ్ బియ్యం (సీఎంఆర్) దాదాపు రూ.6.91 కోట్ల విలువైన ప్రజాధనం అక్రమంగా మళ్లించబడిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆందోళన కలిగించిందని సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి భూక్య శ్రీను నాయక్ పేర్కొన్నారు.ఈ వ్యవహారంలో కేవలం మిల్లు యాజమాన్యానిదే బాధ్యతగా చూడకుండా ప్రజాధనాన్ని సంరక్షించాల్సిన చట్టబద్ధ బాధ్యత కలిగిన పౌరసరఫరాల శాఖ అధికారుల విధి నిర్వహణలో జరిగిన తీవ్రమైన వైఫల్యాలపై కూడా సమగ్ర విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో సేవాలాల్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా వెంకటేష్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ధాన్యం, సీఎంఆర్ బియ్యం నిల్వలు మిల్లుల వద్ద సురక్షితంగా ఉన్నాయా లేదా అనే విషయాన్ని ప్రతి నెల(15 రోజులకు ఒకసారి)భౌతికంగా తనిఖీ చేయడం ,నిల్వలను ధృవీకరించడం ,నిల్వల నమోదుపుస్తకాలను పరిశీలించడం, వ్యత్యాసాలను గుర్తించడం పౌరసరఫరాల శాఖ అధికారుల ప్రాథమిక చట్టబద్ధ విధి అని పేర్కొన్నారు.అయితే ఈ విధులను సక్రమంగా నిర్వహించి ఉంటే వేల మెట్రిక్ టన్నుల ప్రభుత్వ బియ్యం ఒక్కసారిగా మాయమయ్యే పరిస్థితి ఏర్పడేదే కాదన్నారు. ఇంత భారీ పరిమాణంలో సీఎంఆర్ బియ్యం గల్లంతవడం ఒక్క రోజులో జరిగిన విషయం కాదని ఇది నెలల తరబడి పర్యవేక్షణ లోపించినట్లు స్పష్టంగా సూచిస్తోందని అన్నారు.గతంలో అశ్వాపురంలోని వెంకటేశ్వర రైస్ అండ్ ఫ్లోర్ మిల్లులో నిర్వహించిన అధికారిక తనిఖీల్లో సుమారు 637 మెట్రిక్ టన్నుల బియ్యం దాదాపు రూ.2.68 కోట్ల విలువైన నిల్వల్లో వ్యత్యాసం బయటపడిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ ఘటన అనంతరం జిల్లాలోని అన్ని సీఎంఆర్ మిల్లులపై ప్రత్యేక పర్యవేక్షణ నెలవారీ తనిఖీలు ఆకస్మిక తనిఖీలు నిల్వల పరిశీలన నిర్వహించి ఉంటే నేడు శ్రీజ రైస్ మిల్లులో ఇంత భారీ నష్టం సంభవించకుండా నివారించే అవకాశం ఉండేదని అభిప్రాయపడ్డారు.ఒకే జిల్లాలో వరుసగా ఇలాంటి ఘటనలు వెలుగులోకి రావడం వ్యక్తిగత వైఫల్యం కాదని పర్యవేక్షణ వ్యవస్థలో ఉన్న తీవ్రమైన లోపాలకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు.ప్రభుత్వ ఆస్తుల సంరక్షణ బాధ్యత కలిగిన అధికారులు తమ చట్టబద్ధ విధులను నిర్లక్ష్యం చేసినట్లయితే అది కేవలం పరిపాలనా తప్పిదంగా మాత్రమే కాకుండా ప్రజాధనానికి జరిగిన నష్టానికి దారితీసిన తీవ్రమైన బాధ్యతారాహిత్యంగా పరిగణించాలని ఆయన అన్నారు. సంబంధిత అధికారుల పాత్రపై స్వతంత్ర విచారణ జరిపి ఎవరి నిర్లక్ష్యం విధి వైఫల్యం లేదా సహకారం వల్ల ప్రభుత్వానికి నష్టం జరిగిందో నిర్ధారించి చట్టప్రకారం బాధ్యత నిర్ణయించాలని కోరారు. ప్రభుత్వానికి జరిగిన నష్టాన్ని వెంటనే పూడ్చుకునేలా చట్టబద్ధ రికవరీ చర్యలు ప్రారంభించాలని సంబంధిత నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేసి, అవసరమైతే రెవెన్యూ రికవరీ చట్టం కింద చర్యలు చేపట్టి ప్రభుత్వ బకాయిలను వసూలు చేయాలని డిమాండ్ చేశారు. విచారణ పూర్తయ్యే వరకు సంబంధిత రికార్డులు, నిల్వలు ఆస్తులు లావాదేవీలను భద్రపరిచే చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ వ్యవహారాన్ని కేవలం శాఖాపరమైన విచారణతో ముగించకుండా, ఉన్నతస్థాయి స్వతంత్ర దర్యాప్తు సంస్థ ద్వారా సమగ్ర విచారణ జరిపి సీఎంఆర్ బియ్యం మళ్లింపుకు బాధ్యులెవరు నెలవారీ తనిఖీలు ఎందుకు నిర్వహించలేదు నిల్వల వ్యత్యాసాలు ఎప్పటి నుంచి ప్రారంభమయ్యాయి ప్రభుత్వానికి జరిగిన నష్టాన్ని ఎవరు నివారించాల్సి ఉండేది విధి నిర్వహణలో ఎక్కడ లోపాలు చోటుచేసుకున్నాయనే అంశాలపై పూర్తి నివేదికను ప్రజలకు వెల్లడించాలని భూక్య శ్రీను నాయక్ డిమాండ్ చేశారు.ప్రభుత్వ ధాన్యం రైతుల శ్రమ ఫలితమే కాకుండా ప్రజల ఆహార భద్రతకు సంబంధించిన జాతీయ సంపద అని పేర్కొన్న ఆయన, అలాంటి సంపదను కాపాడడంలో నిర్లక్ష్యం ప్రదర్శించిన వారెవరైనా చట్టం ముందు జవాబుదారులేనని అన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని, ప్రభుత్వానికి జరిగిన నష్టాన్ని పూర్తిగా రికవరీ చేయాలని సేవాలాల్ సేన తరఫున ప్రభుత్వాన్ని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో ధరావత్ సురేష్ నాయక్, నాయక్, రవి నాయక్, సురేష్ నాయక్ శేఖర్ తదితరులుపాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి.. రైతుకు తీరని నష్టం

- సుమారు లక్ష రూపాయల విలువైన గేదె మృతి.. జీవనోపాధికి దెబ్బ



అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 3, (ప్రజా జ్యోతి): అన్నపురెడ్డిపల్లి మండలంలోని మర్రిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో మంగళవారం విద్యుత్ షాక్‌కు గురై రైతుకు చెందిన పాడి గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన మేడుదుల గోపాలరావు వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. గేదెను మేత కోసం తీసుకెళ్లిన క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగలడంతో పాడి గేదె మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని రైతు తెలిపారు. పాలు ఇచ్చే పాడి గేదె మృతి చెందడంతో గోపాలరావు కుటుంబానికి జీవనోపాధి కష్టంగా మారింది. వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్న ఆయనకు పాడి గేదె అదనపు ఆదాయానికి ఆసరాగా ఉండేదని, అది మృతి చెందడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

నిరవధిక సమ్మెకు సిద్ధమవుతున్న ఆశా కార్యకర్తలు

- నెలకు రూ.18 వేల స్థిర వేతనం చెల్లించాలి.. ప్రభుత్వ హామీలు అమలు చేయాలని డిమాండ్



అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 3, (ప్రజాజ్యోతి): అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా కార్యకర్తల సంఘం ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ వాణికి సమ్మె నోటీసు అందజేశారు. ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.18 వేల స్థిర వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 15 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు ఆశా కార్యకర్తల సంఘం మండల అధ్యక్షురాలు ముంతాజ్ బేగం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు ఉదయం నుంచి రాత్రి వరకు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించడంతో పాటు ఆన్‌లైన్ పనులు, వివిధ లక్ష్యాలను పూర్తి చేస్తున్నప్పటికీ నెలకు కేవలం రూ.9,900 మాత్రమే వేతనంగా పొందుతున్నారని తెలిపారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కనీస వేతనం నిర్ణయించి చెల్లించాలని కోరారు. ఏఎన్ఎం, జీఎన్ఎం శిక్షణ పూర్తి చేసిన వారికి పదోన్నతుల సౌకర్యం కల్పించాలని, రెండో వేతన సవరణ సంఘం సిఫార్సులను అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులకు నిర్ణయించిన రెండు కరువు భత్యాలను ఆశా కార్యకర్తలకు కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాక విజయ, నాగమణి, రమాదేవి, సుజాత పాల్గొన్నారు.

ఏజెన్సీ ఏరియాలో రోగులకు అండగా వసుధ ఫౌండేషన్ సేవలు

- బ్లడ్ క్యాన్సర్ బాలుడు చికిత్స కొరకు రూ. 30 వేలు ఆర్థిక సాయం
- కిడ్నీ వ్యాధిగ్రస్తురాలికి రూ.10 వేలు అందజేత
- భద్రాచలం దేవస్థానం ఈవో దామోదర్ చేతుల మీదుగా చెక్ అందజేత





భద్రాచలం, నవంబర్ 3 (ప్రజా జ్యోతి)

జిల్లాలో వసుధ ఫౌండేషన్ సేవలు విస్తరిస్తున్నాయి. ఏజెన్సీ ప్రాంతంలో ఇప్పటికే అనేకమంది రోగులకు అండగా ఉన్న వసుధ ఫౌండేషన్ సేవలు అందరికీ తెలిసిందే. అందులో భాగంగా మంగళవారం సత్తుపల్లికి చెందిన 12 సంవత్సరాల బాలుడు చార్లెస్ బ్లడ్ క్యాన్సర్ తో బాధపడుతుండగా అతని వైద్య చికిత్స కోసం వసుధ ఫౌండేషన్ రూ. 30వేల ఆర్థిక సహాయం అందించింది. బ్లడ్ కాన్సర్ తో బాధపడుతున్న ఆ బాలుడు తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో ఉన్న ఓ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించగా అతని చికిత్స కోసం ఆర్థిక సహాయం అందించాలని అతని కుటుంబ సభ్యులువసుధ ఫౌండేషన్ ను ఆశ్రయించారు. ఈ నేపథ్యం లో స్పందించిన వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు రూ 30, 000 ఆర్థిక సహాయం అందించాలని వసుధ ఫౌండేషన్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజు కు సూచించారు. ఈ క్రమంలో భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఈవో కే దామోదర్ రావు చేతుల మీదుగా చార్లెస్ కుటుంబ సభ్యులకు రూ 30వేలకు సంబంధించిన చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఇంజనీరింగ్ విభాగం ఈఈ వి .రవీంద్రనాథ్ ,ఏఈఓ శ్రవణ్ కుమార్, వసుధ ఫౌండేషన్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తురాలికి రూ.10 వేలు అందజేత

కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న భద్రాచలానికి చెందిన అర్జునపూడి నవతకు వసుధ ఫౌండేషన్ ఆర్థిక చేయూత అందించింది. చికిత్స నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు తరఫున ఉమ్మడి జిల్లా కన్వీనర్ వేగేశ్నశ్రీనివాస్ రాజు అందజేశారు.ఈ సందర్భంగా యువ నాయకుడు కుంజా సంతోష్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు విద్య, వైద్య రంగాల్లో అండగా నిలుస్తున్న వసుధ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఆపదలో ఉన్నవారికి ఆర్థిక సహాయం అందించడం మానవత్వానికి నిదర్శనమన్నారు.ఈ కార్యక్రమంలో అర్జునపూడి సక్కుబాయి, హరిబాబు, రాజేష్, సాయి కౌశిక్, సవలం వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బందు వెంకటేశ్వరరావుకు జన్మదిన వేడుకలు

- ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు తరపున బందు వెంకటేశ్వరరావుకు సన్మానం



భద్రాచలం, నవంబర్ 3 (ప్రజా జ్యోతి): ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బందు వెంకటేశ్వరరావు 75వ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని భద్రాచలంలోని సంఘ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. 76వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా సంఘం నాయకులు శాలువాలు, పూలమాలలతో ఆయనను సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా గౌరవ సలహాదారు మాదిరెడ్డి రామ్మోహనరావు మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారంతోపాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సంఘం అభివృద్ధికి బందు వెంకటేశ్వరరావు కృషి చేస్తున్నారని కొనియాడారు.అనంతరం బందు వెంకటేశ్వరరావు తనకు శుభాకాంక్షలు తెలిపిన పెన్షనర్లు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, మిత్రులు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో చంద్రసుబ్బయ్య చౌదరి, కె.ఎస్.ఎల్.వి.ప్రసాద్, డి.కృష్ణమూర్తి, టి.శివప్రసాద్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం

- రక్తదానానికి ముందుకు రావాలి
- పాయం సత్యనారాయణ



చర్ల, నవంబర్ 03: (ప్రజా జ్యోతి): చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ నెల 5వ తేదీన గొండ్వానా సంక్షేమ పరిషత్ (జీఎస్పీ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని అన్ని వర్గాల ప్రజలు, రక్తదాతలు ముందుకు వచ్చి విజయవంతం చేయాలని జీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. చర్ల మండలం సుబ్బంపేట పంచాయతీ పరిధిలోని ఎదిర గుట్టల వద్ద జీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బిరబోయిన శేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.భద్రాచలం కేంద్రంగా అనేక మంది రోగులు సకాలంలో రక్తం అందక ప్రాణాలు కోల్పోతున్నారని, మరికొందరు రక్తహీనతతో బాధపడుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పాయం సత్యనారాయణ అన్నారు. ఇలాంటి వారికి రక్తదానం అందించి ప్రాణాలను కాపాడేందుకు రక్తదాన శిబిరం ఎంతో దోహదపడుతుందని అన్నారు. రక్తదానం ఒక సామాజిక బాధ్యతగా భావించి యువతతో పాటు అన్నివర్గాల ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగే ఈ శిబిరంలో పాల్గొని రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు.ఈ సమావేశంలో జీఎస్పీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గొంది లీలాప్రసాద్, ములుగు జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్, ఇర్ప భరత్, ఈసంపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

- కేసీఆర్‌ను మళ్లీ గెలిపించుకోవాలి-రావులపల్లి రాంప్రసాద్, మానే రామకృష్ణ

చర్ల, నవంబర్ 03: (ప్రజా జ్యోతి): చర్ల మండలంలోని కుర్నపల్లి గ్రామ పంచాయతీలో బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం నిర్వహించారు. కుర్నపల్లి బీఆర్ఎస్ యువ నాయకుడు కన్నారావు బాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి రావులపల్లి రాంప్రసాద్, మానే రామకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం 24 గంటల విద్యుత్ సరఫరా, రైతుబంధు, రైతుబీమా పథకాలను అమలు చేశారని తెలిపారు. గిరిజనుల అభివృద్ధికి పోడు భూములకు పట్టాలు అందించి, రైతుబంధు పథకం ద్వారా ఆర్థిక సహాయం అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. పేదల కోసం ఆసరా పెన్షన్లు, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, ఇంటింటికీ మంచినీటి సరఫరా వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు, 420 హామీల పేరుతో ప్రజలను మోసం చేసిందని వారు విమర్శించారు. అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. రాష్ట్రంలో అభివృద్ధి 20 సంవత్సరాలు వెనక్కి వెళ్లిపోయిందని విమర్శించారు. ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌ను మళ్లీ గెలిపించుకోవాలని పార్టీ శ్రేణులకు సూచించారు.కుర్నపల్లి యువ నాయకుడు కన్నారావు బాలకృష్ణ మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో తమ గిరిజన గ్రామాల్లో రెండు పంటలు పండించే పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. తమ ప్రాంతానికి మూడు ఫేసుల విద్యుత్ సరఫరా అందించి, ఎల్‌నినో వంటి విపత్కర పరిస్థితులను సైతం ధైర్యంగా ఎదుర్కొనేలా రైతులకు అండగా నిలిచారని రైతులను రాజులుగా చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు, కో-కన్వీనర్ అయినవోలు పవన్ కుమార్, పార్టీ సీనియర్ నాయకులు గొర్ల రాజబాబు, పంజ రాజు, కాకి అనిల్, తడికల బుల్లెబ్బాయి, తుర్రం రాజు, నాగరాజు, క్యాప గణేష్, కాక నరసింహారావు, నక్కరాజు తదితరులు పాల్గొన్నారు. పార్టీ యువ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



మానవత్వానికి మారుపేరు గద్దల రామకృష్ణ!

- అభాగ్యురాలికి అండగా నిలిచి ఆత్మగౌరవాన్ని కాపాడిన వైనం
- స్వార్థం పెరుగుతున్న సమాజంలో సేవాగుణంతో ప్రత్యేక గుర్తింపు
- ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే నిజమైన మానవత్వం





అశ్వాపురం, నవంబర్ 03,ప్రజాజ్యోతి నేటి సమాజంలో మానవ సంబంధాలు, మానవతా విలువలు రోజురోజుకూ కనుమరుగవుతున్నాయి. ఒక మనిషిని మరో మనిషి దోచుకునే పరిస్థితులు కనిపిస్తుండగా, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాల్సింది పోయి కొందరు కనీసం పట్టించుకోని దుస్థితి నెలకొంది. ఇలాంటి స్వార్థపూరిత వాతావరణంలో సాటి మనిషి కష్టాన్ని చూసి స్పందించే హృదయం ఉండటం గొప్ప విషయం.అశ్వాపురం ప్రాంతంలో మతిస్థిమితం లేని ఓ మహిళ దుస్తులు లేకుండా దీనస్థితిలో తిరుగుతుండటాన్ని గమనించిన గద్దల రామకృష్ణ మానవతా దృక్పథంతో స్పందించారు. ఆమె పరిస్థితిని చూసి చలించిపోయి వెంటనే దుస్తులు ఏర్పాటు చేసి అందించారు. కనీసం తన పరిస్థితిని తాను అర్థం చేసుకోలేని స్థితిలో ఉన్న ఆ మహిళకు అండగా నిలిచి, ఆమె గౌరవాన్ని కాపాడేందుకు చేసిన ఈ పని పలువురి ప్రశంసలు అందుకుంటోంది.మనిషికి మనిషే అండగా ఉండాలి: ప్రస్తుత సమాజంలో డబ్బు, హోదా, స్వార్థం కోసం పరుగులు తీస్తున్న వారు ఎంతోమంది ఉన్నారు. కానీ ఆపదలో ఉన్నవారికి సహాయం చేయాలనే ఆలోచన కొందరిలోనే కనిపిస్తోంది. సహాయం చేయడానికి ఆస్తులు, అంతస్తులు అవసరం లేదు.. స్పందించే మంచి మనసు ఉంటే చాలని గద్దల రామకృష్ణ తన చర్యతో నిరూపించారు.ప్రచారం కంటే మానవత్వమే ముఖ్యం: ఎదుటివారి కష్టాన్ని గుర్తించి, వారి ఆత్మగౌరవానికి భంగం కలగకుండా సహాయం చేయడం నిజమైన మానవత్వం. దుస్తులు లేకుండా తిరుగుతున్న అభాగ్యురాలికి బట్టలు ఏర్పాటు చేయడం ద్వారా గద్దల రామకృష్ణ సమాజానికి మంచి సందేశాన్ని అందించారు.ఒకరిని ఒకరు మోసం చేసుకునే ఈ రోజుల్లో ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచే ఇలాంటి వ్యక్తులు సమాజానికి ఆదర్శంగా నిలుస్తారు. మనిషి గొప్పతనం సంపాదించిన ఆస్తుల్లోనో, పొందిన హోదాల్లోనో ఉండదు.. తోటివారి కన్నీళ్లు తుడిచే మంచి మనసులోనే ఉంటుందని ఈ ఘటన మరోసారి చాటిచెబుతోంది.

దమ్మపేటలో వివాహిత మహిళ అదృశ్యం

- కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన దమ్మపేట పోలీసులు



దమ్మపేట,నవంబర్. 03,(ప్రజాజ్యోతి):దమ్మపేట గ్రామానికి చెందిన పందేటి వెంకయ్యతన కుమార్తె కుప్పాలరామాంజలిభర్త:రాజు,దేవులపల్లి గ్రామ నివాసి, 02-11-2026 రాత్రి నుంచి కనిపించడం లేదని దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.కుటుంబ సభ్యులు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు స్వీకరించిన దమ్మపేట పోలీసులు కేసు నమోదు చేసి, అదృశ్యమైన మహిళ ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టారు.

పేదల వైద్యానికి ఎమ్మెల్యే జారే అండ

- 156 మంది బాధితులకు సీఎంఆర్ఎఫ్ భరోసా
- బాధితుల వైద్య బిల్లులను సచివాలయంలో అధికారులకు అందజేత



దమ్మపేట,నవంబర్. 03,(ప్రజాజ్యోతి): అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 156 మంది అనారోగ్య బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందించేందుకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ చర్యలు చేపట్టారు. వివిధ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన బాధితుల తరపున సమర్పించిన వైద్య ఖర్చుల బిల్లులను హైదరాబాద్‌లోని తెలంగాణ సచివాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి విభాగం అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చులు భారంగా మారుతున్నాయని, అలాంటి వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్థిక భరోసా కల్పిస్తోందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా మెరుగైన వైద్యం పొందలేని నిరుపేదలకు ఈ పథకం ఎంతో తోడ్పాటునందిస్తోందన్నారు. నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన బాధితులందరికీ ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తానని స్పష్టం చేశారు.

తుఫాన్ ప్రభావం.. దమ్మపేటలో ఎడతెరిపి లేని వర్షం

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. ఇళ్ల నుంచి బయటకు రావొద్దు
- వర్షాలపై క్షేత్రస్థాయిలో డిప్యూటీ కలెక్టర్ మద్దినేని మురళి పర్యవేక్షణ



దమ్మపేట,నవంబర్. 03,(ప్రజాజ్యోతి): తుఫాన్ ప్రభావంతో దమ్మపేట మండలంలో ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తోంది. వర్షాల నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని డిప్యూటీ కలెక్టర్, తహసీల్దార్ మద్దినేని మురళి సూచించారు. వర్షాల కారణంగా చెరువులు, కాలువల పరిస్థితిని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పరిశీలనలో దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి, రాంబాబు,మండల గిర్దావార్ వీరాస్వామి ,పంచాయతి సెక్రటరీ,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం దమ్మపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో మండలంలోని 31 గ్రామపంచాయతీల సర్పంచులతో వీడియో కాల్ ద్వారా మాట్లాడి ఆయా గ్రామాల్లో వర్షాల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, చెరువులు, కాలువల వద్దకు ఎవరూ వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని, ప్రజలు అధికారుల సూచనలు పాటించాలని డిప్యూటీ కలెక్టర్ కోరారు.



ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం..

- వర్షాన్ని సైతం లెక్కచేయకుండా క్షేత్ర స్థాయిలో పర్యటించిన సర్పంచ్ లావుడ్య పూర్ణ
- పెద్ద తండా, ఉయ్యాల వాడలో విద్యుత్ సదుపాయాల మెరుగుదలకు ప్రత్యేక చర్యలు
- హనుమాన్ బస్తి కార్నర్ వద్ద సింగల్ ఫేస్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు
- ఇచ్చిన మాట నిలబెట్టుకుని పనులు చేసి చూపిస్తున్న సర్పంచ్ లావుడియా పూర్ణ





లక్ష్మీదేవి పల్లి, 3 నవంబర్, ప్రజా జ్యోతి: లక్ష్మీదేవి పల్లి మండల కేంద్రంలోని రేగళ్ల పెద్ద తండా గ్రామపంచాయతీ నందు ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడం తోపాటు అదనపు పనులు కూడా చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకుంటానని తెలుపుతూ....గ్రామ అభివృద్ధి మాటల్లో కాదు.. క్షేత్రస్థాయిలో పనులు చేసి చూపించడంలోనే ఉందని నిరూపిస్తూ రేగళ్ల పెద్ద తండా గ్రామ పంచాయతీ సర్పంచ్ లావుడ్య పూర్ణ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నారు.ఈ క్రమంలో గ్రామపంచాయతీ పరిధిలోని పెద్ద తండా, ఉయ్యాలవాడ గ్రామాలలో విద్యుత్ సదుపాయాల మెరుగుదలకు సంబంధించి నూతన విద్యుత్‌స్తంభాల ఏర్పాటు,వీధి దీపాల నిర్వహణకు అవసరమైన కేబుల్ వైర్ల మార్పులు, ఇతర విద్యుత్ సమస్యలను స్వయంగా పరిశీలించారు.అంతేకాకుండా ధరావత్ బాల్య హనుమాన్ బస్తీ కార్నర్ వద్ద విద్యుత్‌పై అధిక లోడ్ పడుతున్న సమస్యను గుర్తించి, ప్రజలకు నిరంతరాయంగా మెరుగైన విద్యుత్ సరఫరా అందించాలనే ఉద్దేశంతో నూతన సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా తడుస్తూనే సంబంధిత లైన్‌మెన్ బాలాజీ నివెంట తీసుకొని గ్రామంలోని ప్రతి వీధి, ప్రతి బస్తీని స్వయంగా తిరుగుతూ విద్యుత్ సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన పనులకు ఎస్టిమేషన్లు రూపొందించేలా చర్యలు చేపట్టారు.పదవి అనేది హోదా కోసం కాదు.. ప్రజల సమస్యలను పరిష్కరించే బాధ్యత కోసం అని చాటిచెబుతూ, ప్రజల మధ్య ఉంటూ ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకుంటూ ముందుకు సాగుతున్న సర్పంచ్ లావుడ్య పూర్ణ పనితీరుపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఎండైనా.. వానైనా.. ప్రజల అవసరాలే ప్రథమ ప్రాధాన్యతగా భావిస్తూ గ్రామంలోని ప్రతి బస్తీకి మౌలిక సదుపాయాలు కల్పించి, అభివృద్ధి ఫలాలు ప్రతి గడపకు చేరేలా తనవంతు కృషి కొనసాగిస్తానని సర్పంచ్ లావుడ్య పూర్ణ తెలిపారు."హామీలు ఇచ్చి వెళ్లడం కాదు.. ప్రజల మధ్యకు వెళ్లి సమస్యలను గుర్తించి, పరిష్కారం చూపించడమే తన రాజకీయ విధానం. గ్రామ అభివృద్ధే నా లక్ష్యం.. ప్రజాసేవే నా బాధ్యత." అని తెలిపారు.

అభివృద్ధి కొరకు ముందడుగు వేస్తున్నాం

- నిధుల బదిలీపై తప్పుడు ప్రచారం బాధాకరం
- గ్రామపంచాయతీ ఈవో శ్రీనివాసరావు
- పనిగట్టుకుని ఆరోపణలు చేయడం దురదృష్టకరం
- భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణ



భద్రాచలం, నవంబర్ 3 (ప్రజా జ్యోతి): భద్రాచలం గ్రామ పంచాయతీలో నిధులను వేరొకరి ఖాతాలోకి బదిలీ చేసినట్లు వార్తాపత్రికల్లో ప్రచురించడం బాధాకరమని గ్రామపంచాయతీ కార్యనిర్వాహక అధికారి చెరుకుమిల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ పూనెం కృష్ణ పేర్కొన్నారు. గ్రామపంచాయతీ పై వాస్తవాలను తెలుసుకోకుండా పనిగట్టుకుని ఆరోపణలు చేయడం దురదృష్టకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు.మంగళవారం సాయంత్రం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. 'మన భద్రాచలం – మన పాలన – మన అభివృద్ధి' అనే లక్ష్యంతో గ్రామపంచాయతీ పాలకవర్గం పనిచేస్తోందని తెలిపారు. సుమారు 11 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత గ్రామపంచాయతీకి ఎన్నికలు జరిగి ప్రజాప్రతినిధులతో పాలకవర్గం ఏర్పడిందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో భద్రాచలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే సంకల్పంతో తాము ముందుకు సాగుతున్నామని చెప్పారు.పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని వివరించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.అయితే అభివృద్ధి దిశగా తాము ఒక అడుగు ముందుకు వేస్తుంటే, కొందరు మూడు అడుగులు వెనక్కి లాగేందుకు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ పనితీరుపై కొంతమంది ఉద్దేశపూర్వకంగా ఆరోపణలు చేస్తూ, ప్రజల్లో అపోహలు సృష్టించడం సరికాదన్నారు. ఏదైనా అంశంపై సందేహాలు ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించి వాస్తవాలు తెలుసుకున్న తర్వాతే వార్తలు ప్రచురించాలని సూచించారు.భద్రాచలం అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని, రాజకీయాలకు, వ్యక్తిగత విమర్శలకు అతీతంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పాలకవర్గం, అధికారులు సమన్వయంతో పనిచేస్తారని వారు స్పష్టం చేశారు. అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని వారు కోరారు.

డిసెంబరు 15 నుంచి ఆశా వర్కర్ల నిరవధిక సమ్మె

- ఎన్నికల హామీలు అమలు చేయాలని సీఐటీయూ డిమాండ్
- వైద్యాధికారులకు సమ్మె నోటీసులు

దమ్మపేట,నవంబర్. 03,(ప్రజాజ్యోతి): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డిసెంబరు 15 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు సీఐటీయూ మండల కన్వీనర్ మురహరి రఘు తెలిపారు. మంగళవారం దమ్మపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్లు ఉదయం నుంచి రాత్రి వరకు విధులు నిర్వహిస్తున్నప్పటికీ నెలకు కేవలం రూ. 9,900 మాత్రమే చెల్లిస్తున్నారని, కనీసం రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత మూడేళ్లుగా తమ సమస్యలను అధికారులు, మంత్రుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించలేదన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యురాలు సునీత, రాధా, నాగమణి, వరలక్ష్మి, ప్రమీల, కుమారి తదితరులు పాల్గొన్నారు.

పట్వారిగూడెం: ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ డిసెంబరు 15 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు శారద తెలిపారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వెంకట ప్రవీణ్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలు మార్లు ఆందోళనలు చేపట్టినా ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఆశా వర్కర్ల నాయకత్వంతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీలత, నాగమణి, భాగ్యమ్మ, కృష్ణవేణి, అంజలి, జైనవి, సరోజిని తదితరులు పాల్గొన్నారు.



